క్లుప్తంగా

వినాయక చవితికి రాట మహోత్సవాలు


విశాలాక్షి నగర్‌లో రాట ఉత్సవంలో స్థానికులు

ఆరిలోవ: వినాయక చవితి సందర్భంగా పందిరి రాట ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, విశాలాక్షి నగర్ లోని పలు ప్రాంతాల్లో శనివారం రాట వేశారు. తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ ఉత్తమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక ఉత్సవాలలో భాగంగా రాట వేశారు. ఇదే వార్డు పరిధి రామాలయం వీధిలో వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానికులు రాటోత్సవం నిర్వహించా రు. పన్నెండో వార్డు పెదగదిలిలో యంగ్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వాటర్ ఫిల్టర్ వితరణ


ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న పారామౌంట్ సంస్థ సభ్యులు

ఆరిలోవ : ఇందిరానగర్‌లో ఉన్న ఆనంద్‌మార్గ్ ఆశ్రమం అనాధ పిల్లలకి వైజాగ్ పారామౌంట్ సంస్థ సహకారం అందించింది. శనివారం సంస్థ సభ్యులు వాటర్ ప్యూర్‌ఫైని ఇక్కడి స్వామీజీ సౌమ్యానంద్ అవధూతకు అందించారు. ఈ సందర్భంగా స్వామీజీ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నగరాధ్యక్షుడికి అభినందనలు


బీజేపీ నగరాధ్యక్షుడిని గజమాలతో సత్కరిస్తున్న మహిళా నాయకులు

ఎంవీపీకాలనీ : బీజేపీ నగర అధ్యక్షుడిగా రెండవ సారి మేడపాటి రవీంద్రరెడ్డి నియమితులు కావడం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు పలు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆయనకు అభినందలు అందాయి. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గజమాలతో ఆయనను సత్కరించారు. తొలుత ఆయన పార్టీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, విష్ణుకుమార్‌రాజు, పీవీఎస్ మాధవ్ వంటి ముఖ్య నాయకులను కలిశారు. ఈ సందర్భంగా వారు రవీంద్రకు అభినందనలు తెలిపారు.

అప్పన్న గోసంరక్షణ పథకానికి రూ.2 లక్షల విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గోసంరక్షణ పథకానికి నగరంలోని మధురానగర్‌కు చెందిన ఎం.ఎస్.వి.ఎస్.బి.ఎల్. చంద్రిక అనే దాత శనివారం రూ. రెండు లక్షలు అందజేశారు. కొండదిగువ పరిపాలనా కార్యాలయంలో నగదు రూపంలో ఏఈవో రమణమూర్తికి ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు బాండ్ అందజేశారు.

అలరించిన హాస్యవల్లరి

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో శనివారం రాత్రి కోరుకొండ రంగారావు బృందం ప్రదర్శించిన హాస్యవల్లరి ప్రేక్షకులను అలరించింది. టీవీ-101, నాలుగు వారాల షాపింగ్ ఫ్రేమ్, ఉద్యోగం పోయింది, జనాభా లెక్కలు, సిట్యుయేషన్ సాంగ్ వంటి స్కిట్లు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ఈ సందర్భంగా వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యులు హాస్యనటులను సత్కరించారు.

నేరానికి శిక్ష తప్పదు

- చట్టానికి ఎవరూ అతీతులు కాదు
- చంద్రబాబు అరెస్టుపై ప్రజల స్పందన

ఆరిలోవ/మద్దిలపాలెం/బీచ్‌రోడ్డు : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీఐడీ అధికారులు అరెస్టు చేయడాన్ని నియోజకవర్గ ప్రజలు సమర్థిస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం వినియోగించాల్సిన ధనాన్ని స్వాహా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుపరిపాలన అందించాలని అధికారం ఇస్తే దుర్వినియోగం చేశారని విమర్శిస్తున్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని అంటున్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టేవారు, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే వారికి ఇది గుణపాఠం కావాలని కోరుతున్నారు.

అవినీతిపరుడిని అరెస్టు చేస్తే ఆందోళనలెందుకు?



చంద్రబాబు నాయుడు ప్రజలు కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ డబ్బును దోచేశాడు. అలాంటి వ్యక్తిని సీఐడీ అధికారులు అరెస్టు చేయడం మంచిదే. కానీ టీడీపీ నాయకులు మాత్రం ఆందోళనలు చేసి సాధారణ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. అవినీతికి పాల్పడినవారు ఎంత స్థాయిలో ఉన్నవారైనా శిక్ష పడాల్సిందే. చంద్రబాబును అరెస్టు చేయడం సరైనదే. మిగిలినవారు అవినీతికి పాల్పడకుండా ఉంటారు.

– తాడ్డి గణపతి, టీవీసీ పాయింట్, ఆరిలోవ

ప్రభుత్వ సొమ్ము తినేయడం దారుణం



ప్రజలకు మేలు చేస్తారని ఆశతో ఓట్లేసి అధికారమిస్తే దుర్వినియోగం చేస్తే ఎలా? ప్రజల కోసం ఖర్చు చేయాల్సిన సొమ్మును పాలకుడే తినేస్తే సామాన్యుల గతేంటి? ఇది చాలా దారుణం. ఈ విషయంలో చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం మంచిదే. ఇలాంటివారిని వదిలి పెట్టకూడదు. ఈ కేసులో ఉన్నవారందర్నీ అరెస్టు చేయాలి.

– ఎ.సరోజిని, గృహిణి, సింహగిరికాలనీ

తిన్నదంతా తిరిగి చెల్లించేలా చూడాలి



చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉంటూ ప్రజలను మోసం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్లు ప్రభుత్వ సొమ్మును దారి మళ్లించి తాను సొంతం చేసుకున్నాడు. ఆయన తిన్నదంతా తిరిగి ప్రభుత్వానికి చెల్లించేటట్లు అధికారులు ప్రయత్నం చేయాలి. ఆయనను అరెస్టుతో వదిలేయకూడదు. ఇలాంటి మోసం మరెవరూ చేయకూడదు.

– రెడ్డి గన్నిరాజు, శివాజీనగర్-2, ఆరిలోవ

అధికారం అడ్డు పెట్టుకుని దోచేశారు



అధికారాన్ని అడ్డు పెట్టుకుని చంద్రబాబు మోసానికి పాల్పడటం దారుణం. ఇలాంటివి క్షమించరానివి. దీనికి తగిన శిక్ష వేయాల్సిందే. రూ.371 కోట్లు విదేశాలకు పంపించి, మళ్లీ దాన్ని తాను పొందేలా ఏర్పాట్లు చేసుకున్నాడు. డబ్బు దోచేయడంలో ఆయన చాలా మేధావి.

– జి.ఆదినారాయణ, ఆదర్శనగర్, డెయిరీఫారం, ఎలక్ట్రీషియన్

చట్టం దృష్టిలో అందరూ ఒక్కటే..



అధికారాన్ని అడ్డు పెట్టుకుని కోట్లాది రూపాయిలు కొల్లగొట్టాలని చూస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు. ఓట్లేసిన జనాన్నే మోసం చేసి ప్రభుత్వ సొమ్మును స్వాహా చేస్తే చట్టం తన పని తను చేసుకుపోతుంది. చంద్రబాబు అరెస్టే దీనికి నిదర్శనం.

– జి.త్రినాథ్, హెచ్‌బీ కాలనీ

అక్రమాలకు పాల్పడితే అరెస్ట్ చేస్తారు



అక్రమంగా కోట్లాది రూపాయిలు స్వాహా చేస్తే చూస్తూ ఊరుకోరు కదా. అరెస్టు చేస్తారు. అదే ఇప్పుడు చంద్రబాబుకు జరిగింది. అధికారంలో ప్రజల మేలు చేయడం కంటే వారి పేరు చెప్పుకొని కోట్లు దోచుకునేవారు ఇలానే కటకటాల పాలవుతారు. చట్టం నుంచి ఏ ఒక్కరూ తప్పించుకోలేరు.

– కె.వెంకటరావు, హెచ్‌బీ కాలనీ

కోట్లు దోచేసి.. యువతకు ద్రోహం చేశారు



రాష్ట్రంలో యువత నైపుణ్యాభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన కోట్ల రూపాయలను చంద్రబాబు దోచుకోవడం అన్యాయం. ఇది యువతకు ద్రోహం చేయడమే. టీడీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు ఎలాగో ఇవ్వలేదు, కనీసం నైపుణ్యాభివృద్ధికి ఇచ్చిన నిధులను దోచేసుకున్నారు. ఇలాంటి వ్యక్తిని అరెస్ట్ చేసి, చట్టానికి ఎవరూ చుట్టం కాదని నిరూపించారు.

– యు సూరిబాబు, శివాజీపాలెం

ప్రజల సొమ్ము దోచుకుంటే శిక్ష తప్పదు



ప్రజలు సొమ్ము వందల కోట్లు కాజేసి, చంద్రబాబు అరెస్టయ్యారు. ఈ విషయంలో టీడీపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇన్‌కంటాక్స్, ఈడీ అధికారులు విచారణ చేసి, సీఐడీ వాళ్ల కేసు నమోదు చేసి చంద్రబాబును అరెస్టు చేశారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విచారణ కాదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు చేపట్టిన విచారణకు కొనసాగింపుగా సీఐడీ వాళ్ల కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రజలు సొమ్ము దోచుకున్నవారు ఎప్పటికైనా చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందే.

– కులిడి సురేష్ బాబు, బీచ్ రోడ్డు

చంద్రబాబే పెద్ద దొంగ



ప్రతీ ఒక్కరిని దొంగ, అక్రమార్కుడు అని ప్రజలకు తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబే నేడు దొంగగా తేలాడు. యువత నైపుణ్యాభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన సొమ్మును చంద్రబాబు తన అభివృద్ధి కోసం ఖర్చు చేశాడు. ఇటువంటి వాళ్లను క్షమించకూడదు. కోర్టులు కఠినంగా శిక్షించాలి.

– ఎస్.వినయ్ కుమార్, రామ్‌నగర్

చంద్రబాబు అరెస్టుపై ప్రజల హర్షం

వైఎస్సార్‌సీపీ నాయకుల వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

ఎంవీపీకాలనీ: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుపై విశాఖ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు పేర్కొన్నారు. ఎంపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు భారీ కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. కొంతకాలంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీ, ఈడీ, సెబీ అనేక కీలక ఆధారాలను సేకరించాయని చెప్పారు. 3 వేల కోట్ల ప్రాజెక్టులో 10శాతం నిధులు అక్రమంగా కాజేశారన్నారు. పలువురు కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు మాట్లాడుతూ ఈ అరెస్టులో కక్షపూరిత చర్యలు ఉన్నాయంటూ టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయని దర్యాప్తు సంస్థలు నిర్ధారించిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు. అందుకే చంద్రబాబు అరెస్ట్‌పై హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పల్లా దుర్గారావు, ఉమ్మిడి స్వాతి, అక్కరమాని రోహిణి, అప్పారి గిరిబాబు, ముర్వల లక్ష్మి, సురాడ దాసు, పుక్కళ్ల శంకర్, మధుపాడ రవి, పీతల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం డిపోనకు రూ.5లక్షల నష్టం

డిపోలో 40 బస్సుల నిలిపివేత


మద్దిలపాలెం డిపోలో నిలిచిపోయిన బస్సులు

మద్దిలపాలెం : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు చేయడంతో ఆందోళనకారులు ఎక్కడ బస్సులపై దాడులకు పాల్పడతారోనని ముందస్తుగా చాలా సర్వీసులు నిలిపివేశారు. మద్దిలపాలెం డిపోలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ బస్సులు ఎక్కడి అక్కడే నిలిచిపోయాయి. సిటీలో సర్వీసు బస్సులు 40వరకూ పూర్తిగా రద్దు చేశారు. కాగా ఇదే డిపో నుంచి సుదీర ప్రాంతాలకు వెళ్లే అన్ని సర్వీసులను పూర్తి నిలిపివేశారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా బస్సులను నిలిపివేశామని ప్రజా రవాణా శాఖాధికారులు పేర్కొంటున్నారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ మద్దిలపాలెం నుంచి ఒక్క బస్సు కూడా కదలేదు. తర్వాత నుంచి నగరంలో పలు ప్రాంతాలకు కొన్ని సర్వీసులు నడిపారు. కాగా సిటీ బస్సులను సుమారు 40 బస్సులు రద్దు చేశారు. దీంతో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా సుదీర ప్రాంతాలైన కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం వంటి ప్రాంతాలకు నడిపే ఏసీ బస్సులు 10 సర్వీసులను పూర్తి రద్దు చేశారు. దీంతో మరో రూ.2 లక్షల వరకూ నష్టం ఏర్పడిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

టీడీపీ ఆందోళన


పెదగదిలిలో ఆందోళన చేస్తున్న ఆరిలోవ టీడీపీ నాయకులు

ఆరిలోవ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సీఐడీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో శనివారం ఆరిలోవ ప్రాంతంలో టీడీపీ నాయకులు ఆందోళనకు దిగారు. పెదగదిలి బీఆర్‌టీఎస్ కూడలిలో ధర్నా చేపట్టారు. అక్కడికి చేరుకున్న పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. దీంతో కొంత సేపు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం ఆందోళ నకు దిగిన టీడీపీ నాయకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించగా.. అక్కడ కూడా నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పదో వార్డు టీడీపీ కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, టీడీపీ మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావులను గృహ నిర్బంధంలో ఉంచారు.

తెలుగు తల్లి విగ్రహం వద్ద ..

మద్దిలపాలెం: మద్దిలపాలెం తెలుగు తల్లి విగ్రహం వద్ద టీడీపీ నాయకులు నిరసనకు యత్నించగా ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు వారిని అదుపులోకి తీసుకుని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ముందస్తు చర్యలతో అవినీతి నిర్మూలన

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డీఆర్‌ఎం కార్యాలయంలో శనివారం అవినీతి నిర్మూలన, నిఘా ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎదుర్కొన్న అవరోధాలు, పొరపాట్లను సరిచేసుకునేలా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడం వల్ల తదుపరి విధుల్లో పొరపాట్లకు ఆస్కారం ఉండదన్నారు. డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.పి.సిన్హా మాట్లాడుతూ ఉద్యోగులందరూ అవినీతి నిర్మూలనలో ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవినీతి, లంచాలకు తావులేని విధంగా నిష్పక్షపాతంగా సేవలందించేందుకు ఇటువంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. రైల్వేలో టెండర్లు, ఆక్షన్లు, కాంట్రాక్టులు, పలు కార్యక్రమాల్లో క్రమశిక్షణ, నిజాయితీలతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగుల నుంచి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్-2 పి.జె. శర్మ, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.అవినాష్ శర్మ, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ సౌరభ్ ప్రకాష్, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్(పర్సనల్) ఎ.రామారావు, ట్రాఫిక్, కమర్షియల్, పర్సనల్ బ్రాంచ్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా రేపు

కంచరపాలెం: ఈ నెల 11న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2023 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ నరవలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ మేళా జరుగుతుందని తెలిపారు. ఐటీఐల్లో వివిధ కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ పూర్తి చేయని వారు, ఆర్ అండ్ ఏసీ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ ట్రేడులు పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ షిప్ మేళాకు అర్హులన్నారు. 15 జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం నరవ ఐటీఐలో ఉదయం 10 గంటలకు నేరుగా బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 93987 85720 నంబర్‌లో సంప్రదించాలని విజయలక్ష్మి సూచించారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు


సంపత్ వెంకన్న ఆలయంలో పల్లా సత్యనారాయణకు ముఖద్వార డోర్ కర్టెన్లు అందిస్తున్న భక్తులు


కలియుగ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ దశమి సందర్భంగా శనివారం స్థానిక వేంకటేశ్వరుడి ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్యామాచార్యులు నేతృత్వంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. వేంకటేశ్వరుడి గర్భగుడికి శంకుచక్రాలు ముద్రించిన డోర్ కర్టెన్లను ఓ భక్తుడు శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణకు అందజేశారు. పల్లా వెంకటరావు, పల్లా పెంటారావు, కొయ్య జగదీష్, నమ్మి భాస్కర్ తదితర సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ. 4.10 లక్షల జరిమానా


డాబాగార్డెన్స్‌లో వాహన చోదకులను తనిఖీ చేస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి

అల్లిపురం : మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలకు పైగా జరిమానా తప్పదని టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు. శనివారం ఒక్కరోజే టూటౌన్ పరిధిలో 36 మంది నుంచి కోర్టు రూ.4 లక్షల 10 వేలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెన్ స్కూల్, అంబేద్కర్ జంక్షన్, అల్లిపురం జంక్షన్‌లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టబడ్డ వారిని శనివారం నగరంలో స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లక్ష్మి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే న్యాయస్థానాల్లో భారీ జరిమానా తప్పదని, అదే విధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జేసీఐ లక్ష్యం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న జేసీఐ విశాఖ వేలీ సభ్యులు


రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న జేసీఐ విశాఖ ప్రైడ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : నగర ప్రజలకు చక్కటి ఆరోగ్యాన్ని అందివ్వటమే లక్ష్యమని జేసీఐ విశాఖ వేలీ సంస్థ అధ్యక్షుడు అమరేష్ పేర్కొన్నారు. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శనివారం జేసీఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు సంతాన సమస్యలతో బాధపడుతున్న మహిళలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసీఐ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా తొలిరోజు ఆరోగ్యపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, రెండో రోజు తాగునీరు, మూడవ రోజు రోడ్ సేఫ్టీ తదితర అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారిని సత్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జేసీఐ సెక్రటరీ ఇంద్రజ, డెంటల్ డాక్టర్ విఠల్‌కుమార్, డాక్టర్ మురళీకృష్ణ, సురేష్, సింధూర తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ రక్తదాన శిబిరం

జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ ప్రైడ్ ఆధ్వర్యంలో శనివారం జగదాంబ జంక్షన్ సమీపాన వాల్తేర్ అప్‌రోడ్డులో గల మదర్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జేసీఐ వీక్ జైత్ర కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జేసీఐ విశాఖ ప్రైడ్ ప్రెసిడెంట్ కె. లక్ష్మీసురేఖ తెలిపారు. రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సెక్రటరీ చందు కటకం, కోశాధికారి కె. శ్రీను, సభ్యులు కె. రిషి, పి. అశోక్, వంశీ, పునీత్, ఎస్. సంతోష్, దేవుడు నాయుడు, కె. లక్ష్మణరావు, వీవీ నాయుడుతో పాటు 20 మంది రక్తదాతలు, మదర్ బ్లడ్‌బ్యాంక్ అధినేత శివగుప్తా పాల్గొన్నారు.

ఆనందమానందమాయె..!

నందడిగా కేవీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్‌కు చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు


విశ్రాంత గురువులను సత్కరిస్తున్న కేంద్రీయ విద్యాలయ వాల్తేర్ పూర్వ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారి పక్కనున్న తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో శనివారం పూర్వ విద్యార్థుల 3వ సమ్మేళనం మిలాన్-2023 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేవీ వాల్తేర్, మిలన్-2023 కన్వీనర్ కల్నల్ విజయ్ బలరామ్ మాట్లాడుతూ 1986 నుంచి 2023 వరకు ఈ స్కూల్‌లో విద్యనభ్యసించిన అనేక మంది పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులంతా దేశ విదేశాల్లో ఉన్నత హోదాలు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఎందరో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి, విజయవంతమైన వ్యక్తులుగా తయారుచేసి, మార్గనిర్దేశం చేసిన గురువులకు తామంతా రుణపడి ఉంటామని తెలుపుతూ.. కృతజ్ఞతగా వారందరినీ సత్కరించామన్నారు.

10 మంది పేద విద్యార్థులకు సాయం

ప్రస్తుత విద్యార్థుల్లో 10 మంది పేద పిల్లలు ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నారని తెలుపగా.. అలుమ్ని సభ్యులు వీరి కోసం రూ.48 వేల చెక్కును ప్రిన్సిపాల్ కమల్‌జీత్‌కు అందజేశారు. ఈ పాఠశాల విద్యార్థులకు భవిష్యత్తులో ఏ రకమైన ఆటంకాలున్నా.. వారిని దత్తత తీసుకుని తామే చదివించేందుకు కోర్ కమిటీ తీర్మానించిందని విజయ్ బలరాం తెలిపారు. ఈ సందర్భంగా మిలాన్-2023 కమిటీ సభ్యులు 50 మంది విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సభ్యులు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ సందడిగా.. సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో సి.వి.రఘు, ఎస్.వి.సురూప, రాజకుమారి, విజయ్‌భాస్కర్, డి.భాస్కర్, అనిత, రవికిరణ్, హంజీ, వాసు, మూర్తి, ఉదయ్, పలువురు దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వినోద్ బాలుకు 'సురా' పురస్కారం

సీతంపేట: హేతువాది పేరిచర్ల సుబ్బరాజు(సురా) సామాజిక సేవా పురస్కారం 2023 సంవత్సరానికి సోషల్ వర్కర్ ఉడుముల వినోద్ బాలుకు ప్రదానం చేశారు. సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అధ్యక్షతన శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా పురస్కారం, రూ.25 వేల నగదును ఆయనకు అందించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ రక్తదాన ఉద్యమకారుడు, 937 రక్తదాన శిబిరాలు నిర్వహించి, 52 వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించి వేలాది మంది ప్రాణాలు నిలిపిన వినోద్ బాలుకు సురా పురస్కారం ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. బాలు చేస్తున్న కృషికి ఇప్పటికే యూత్ సర్వీసెస్ అవార్డు, ఛత్రపతి అవార్డు, ఆపద్బాంధవుడు, యంగ్ డైనమిక్ పర్సన్, భారత రక్త బంధు పురస్కారం వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ ట్రస్టీ కె.బాబూరావు, రచయితలు అనిశెట్టి రజిత, కె.ఎస్.మల్లీశ్వరి, రిటైర్డ్ ప్రొఫెసర్ పేటా బాబివర్ధన్, సరిగమ సంగీత సంస్థ ఫౌండర్ ఎస్.కోటేశ్వరరావు, ట్రస్టు ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.